## క్లుప్తంగా

### రేపటి నుంచి ఉమ్మడి జిల్లా షటిల్ పోటీలు

కొణిజర్ల : కొణిజర్ల హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో స్థానిక రామాలయం ఎదురుగా ఈ నెల 10, 11, 12 తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ పోటీలు, అండర్–17 డబుల్స్ షటిల్ పోటీలు ఉంటాయని నిర్వాహకులు శివ, రఫీ, సైదులు తెలిపారు. పురుషుల డబుల్స్ ప్రథమ బహుమతి రూ. 12,016, ద్వితీయ రూ. 10,016, తృతీయ రూ. 8,016, నాలుగో బహుమతి రూ. 6,016, అండర్–17 డబుల్స్‌లో ప్రథమ బహుమతి రూ. 5,016, ద్వితీ య బహుమతి రూ. 3,016గా నిర్ణయించామని తెలిపారు. క్రీడాకారులు గురువారం సాయంత్రం 4 గంటల లోపు ఎంట్రీలు పంపాలని, ఎంట్రీ ఫీజు రూ. 500, అండర్ 17 విభాగానికి రూ. 300 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9000125016, 9603008891, 9866789360 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మధిర: ఖమ్మం కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూత్ ఫెస్టివల్ డిస్ట్రిక్ట్ లెవెల్ పోటీల్లో మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. గ్రూప్ డాన్స్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ స్థానం సాధించి బహుమతులు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయదాస్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తొరియాని ఆయన అభినందించారు. తమ కళాశాల విద్యార్థులు అని రంగాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

#### కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల..


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కల్లూరు: ఎన్‌ఎస్‌ఎస్ యూత్ ఫెస్టివల్ డిస్ట్రిక్ట్ లెవెల్ పోటీల్లో కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు సాధించారు. దీంతో విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుతుంబాక శ్రీనివాస్ అభినందించారు. వకృత్వ, రంగోలి, గ్రూప్‌డ్యాన్స్, ఎలక్యూషన్, పోస్టర్ పెయింటింగ్, సోలో ఇన్‌స్ట్రుమెంట్, సోలోసాంగ్ పోటీల్లో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం ఆఫీసర్ వీరభద్రం, అధ్యాపకులు భాను, శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, వరలక్ష్మి, ప్రసన్న, జ్యోతి, పుల్లారావు, రమాదేవి, నాగేశ్వరరావు, బాలకృష్ణ, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

#### 13న జిల్లాస్థాయి పాటల పోటీలు..


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్

వైరా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వైరాలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించే జిల్లాస్థాయి పాటల పోటీలు జయప్రదం చేయాలని మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ పిలుపునిచ్చారు. రవళి కళానిలయం వైరా వారి ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి పాటల పోటీలు నిర్వహిస్తుండగా అందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం రాజశేఖర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గద్వాల రమేష్, మచ్చా రామారావు, రేచర్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల హామీలు అమలు చేయాలి



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

కొణిజర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ.. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. డీటీ రాముకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు షేక్ ఖాసీమ్ మాట్లాడుతూ గత పదిహేనేళ్లుగా రేషన్ కార్డులు లేక నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు పఠాన్ ఖాసీమ్ ఖాన్, కుమ్మరి గరటయ్య, ఉపేందర్, లచ్చన్న, లాలు, నాగేశ్వరరావు, సిద్దు, కోటమ్మ, బూడిదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్.. ఇవేం రహదారులు

**గోతులమయంగా రోడ్లు**
- నరకయాతనగా మారిన ప్రయాణం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


గుంతలమయమైన ఎర్రుపాలెం - జయంతి రోడ్డు


అధ్వానంగా ఉన్న ములుగుమాడు - ఇనగాలి రోడ్డు

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లోని ఆర్ అండ్‌బీ, పంచాయతీ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇవేం రోడ్లు బాబోయ్ అంటూ ప్రయాణికులు హడలెత్తుతున్నారు. తమ రోడ్లు బాగు చేయాలని ఓవైపు ఆయా గ్రామాల ప్రజలు.. మరోవైపు ప్రయాణికులు మొత్తుకుంటున్నప్పటికీ పట్టించుకున్న పాలకులు, అధికారులు లేకుండా పోయారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**గుంతలమయంగా ఎర్రుపాలెం–జయంతి రహదారి..**

మండలకేంద్రం నుంచి జయంతి గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. రెండు దశాబ్దాలుగా రోడ్డు అధ్వానంగా ఉన్నప్పటికీ పంచాయతీరాజ్ శాఖ అధికారులు గుప్పెడు మట్టి కూడా వేయని పరిస్థితి ఉంది. ఈరోడ్డులో వర్షాకాలమైతే వాహనచోదకులు చుక్కలు చూస్తున్నారు. తరచూ ప్రమాదాలకు గురై క్షతగాత్రులవుతున్నారు. ఈరహదారిపై నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. గ్రామస్తులు, ప్రయాణికులు పలుమార్లు పాలకుల దృష్టికి తెచ్చినప్పటికీ మరమ్మతులు చేయకపోవడంతో స్థానికులు మండిపడుతున్నారు.

**అధ్వానంగా ములుగుమాడు–ఇనగాలి రోడ్డు**

ములుగుమాడు–ఇనగాలి గ్రామాల మధ్య ఉన్న వాగు చప్టా వద్ద రోడ్డు గుంతలమయమైంది. ఇటీవల కురిసిన వర్షాలకు చప్టా వద్ద వాగు ఉధృతంగా పొంగడంతో మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఈరోడ్డు గుంతలతో ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు కూడా గుంతల కారణంగా కుదుపులకు గురవతూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

**ఎర్రుపాలెం–జమలాపురం రహదారి..**

ఎర్రుపాలెం నుంచి తెల్లపాలెం, కండ్రిక గ్రామాల మీదుగా జమలాపురం వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఎర్రుపాలెం టూ వయా బంజర గ్రామం మీదుగా జమలాపురం గ్రామానికి వెళ్లే రహదారికి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ రోడ్డే వాహదారులకు దిక్కుగా మారింది. దీంతో జమలాపురం పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులతో పాటు సాదారణ జనజీవనంతో రద్దీ బాగా పెరిగింది. ప్రత్యామ్నయ రోడ్డుగా ఉన్న ఎర్రుపాలెం నుంచి జమలాపురం గ్రామం వరకు 6 కి.మీ దూరం ఏమాత్రం బాగోలేదు. కండ్రిక నుంచి జమలాపురం వరకు రోడ్డు బాగాలోక పోవడంతో పాటు ఇరువైపులా కంపచెట్లు పెరిగి రోడ్డు మూసుకుపోయింది.

**ఇబ్బందులు పడుతున్నాం..**



ఎర్రుపాలెం నుంచి జయంతి గ్రామం వెళ్లే రహదారికి గత రెండు దశాబ్దాలుగా అధికారులు మరమ్మతులు చేయడం లేదు. రోడ్డు అంతా గుంతలమయంగా ఉంది. ప్రయాణం చేయాలంటే అరచేతిలో ప్రాణం పెట్టుకోవాల్సివస్తుంది. పంట పొలాలకు వెళ్లే రైతులు ఉత్పత్తులు తెచ్చుకునే సమయంలో పలు మార్లు క్షతగ్రాతులైన ఘటనలున్నాయి. ఇకనైనా రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

– సూరంశెట్టి రాజేష్, ఎర్రుపాలెం

**త్వరలో మరమ్మతులు చేయిస్తాం..**



ఎర్రుపాలెం–తెల్లపాలెం గ్రామాల మధ్య చెరువు వద్ద, ములుగుమాడు – ఇనగాలి గ్రామాల మధ్య తుఫాన్ సమయంలో భారీ వర్షాలకు చెరువులు, వాగులు పొంగి రహదారులు దెబ్బతిన్న విషయం వాస్తవమే. మరమ్మతులకు నిధులు రాగానే పనులు పూర్తి చేయిస్తాం. కండ్రిక – జమలాపురం రోడ్డు మార్గంలో కంప పెరిగింది. తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. సమస్యను పరిష్కరిస్తాం.

– రాజేష్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఎర్రుపాలెం

# పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కండి


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఎర్రుపాలెం: ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న పంచాయతీ ఎన్నికల పోరుకు కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ క్యాంప్‌కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్భయంగా నిజాలను పలికే కమ్యూనిస్టులకు కష్టాలు తప్పవని, ఉద్యమాలతోనే ఎర్రజెండా పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు కష్టపడాల్సివుందన్నారు. నాయకులు పార్టీలు మారటం, అధికారాలు మారటం తప్ప పరిపాలనలో ఎటువంటి మార్పులు లేవన్నారు. ఎర్రుపాలెం మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్న క్రమంలో ప్రతిపక్షంగా సీపీఎం కాబోతుందని ఆ మేరకు పంచాయతీ ఎన్నికల్లో ఎక్కువ గెలుచుకుని సత్తా చాటాలని సూచనలు చేశారు. అనంతరం రైతులందరీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ మండలకేంద్రంలోని డీసీసీబీ బ్యాంక్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, మహిళా నాయకురాలు బండి పద్మ, నాయకులు తదితరులు ఉన్నారు.

### నాణ్యత పాటించాలి


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రదీప్తబాబు, రమేష్‌బాబు

ముదిగొండ: తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలో పలు మండలాలకు బీటీ రహదారులకు ఇటీవల శంకుస్థాపన చేశారు. ఆ దశలో బుధవారం ముదిగొండ మండలంలోని కట్టకూరు నుంచి గోకినేపల్లి వరకు 3.6కిలో మీటర్ల మేర రహదారి నిర్మాణ పనులకు ముదిగొండ సొసైటీ డైరెక్టర్ వనం ప్రదీప్తచక్రవర్తి, మండల అధ్యక్షుడు రమేష్‌బాబులు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పావని, మేడేపల్లి సొసైటీ చైర్మన్ సామినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మధిర: మధిర పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో భవన నిర్మాణానికి సెంట్రింగ్ పని చేస్తుండగా ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మధిర పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన గద్దల నాగేశ్వరరావు(40) సెంట్రింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్‌సీఎం చర్చి సమీపంలో జరుగుతున్న భవన నిర్మాణానికి సెంట్రింగ్ పనిచేస్తూ వారం క్రితం ప్రమాదవశాత్తు కింద పడటంతో ఆయనకి ఖమ్మంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో మూడు రోజులు పాటు చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 7న మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

### ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

ముదిగొండ: మండలంలోని కమలాపురం, ముత్తారం, న్యూలక్ష్మీపురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి బుధవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించిన ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సురేష్, లక్ష్మి, పాల్గొన్నారు.


### మెప్మా ఆర్పీలకు వేతనాలు విడుదల

సత్తుపల్లిటౌన్: మున్సిపాలిటీలో మెప్మా ఆర్పీలకు ఎట్టకేలకు వేతనాలు విడుదల అయ్యాయి. 6నెలలుగా వేతనాలు లేక అవస్థలు పడుతున్న రీసోర్స్ పర్సన్లకు వేతనాలు విడుదల చేయడంతో సత్తుపల్లి మున్సిపాలిటీలోని ఆర్పీలు బుధవారం చైర్మన్ కూసంపూడి మహేష్‌కు స్వీట్లు అందించారు. ఇక మీదట ఆయా మున్సిపాలిటీల నుంచే వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. అసలే ఆర్థిక వనరులు లేక చతికిల పడుతున్న మున్సిపాలిటీలకు ఇది అదనపు భారంగా పరిణమించింది.

### 'ఆశ'ల సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లిటౌన్: ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విటల్ అన్నారు. బుధవారం సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10న స్థానిక ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమాన్ని ఆశా కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమ్య, సర్వేశ్వరరావు, సువర్ణ, శారద, ఉదయశ్రీ, జమాయమ్మ, రాధ, జయమ్మ పాల్గొన్నారు.

# 10న కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ ధామస్, తదితరులు

తల్లాడ: ఈ నెల 10న తల్లాడ మండలం రెడ్డిగూడెం క్రీస్తుజ్యోతి జూనియర్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ ధామస్ అన్నారు. క్రీస్తుజ్యోతి కళాశాలలో బుధవారం జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2000 సంవత్సరంలో పేద విద్యార్థుల కోసం మైపస్ పాల్ స్థాపించిన కళాశాల పాతిక సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్, కళాశాల చైర్మన్ సగిలి ప్రకాష్, జిల్లా, మండల అధికారులు హాజరౌతారని తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో క్రీస్తుజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, సిస్టర్ ప్రిన్స్, సీనియర్ అధ్యాపకులు అప్పారావు, అబ్రహాం పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మధిర: మధిర 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీఈ ఎం అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న మూడు గంటల పాటు మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోదారులు గమనించి సహకరించాలని కోరారు.

తల్లాడ: మండలంలోని పినపాక ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా రెడ్డిగూడెం, మంగాపురం, గొల్లగూడెం, అంబేద్కర్ నగర్ గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాయల ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కారేపల్లి: తెలంగాణ రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న 643 గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని మండలంలోని గాంధీ నగర్ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురకుల పాఠశాల ప్రిన్స్‌పాల్ హరికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వేల్ఫేర్ గురుకులాల్లో 6,7,8,9వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి.. ఖమ్మంలో ఉన్న ఎస్‌ఓఈ బాలుర గురుకులంలో 90సీట్లకు, పరిగిలో ఉన్న ఎస్‌ఓఈ బాలికల గురుకులంలో 90 సీట్లకు ఫిబ్రవరి ఒకటిలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని.. మరిన్ని వివరాలకు 9493011065 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

### పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

సత్తుపల్లి: గత రెండేళ్లుగా ట్రెజరీలో ఆమోదం పొంది ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సప్లమెంటరీ వేతనాలు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ పెన్షన్ తదితర బిల్లులు వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. బుధవారం గంగారంలోని దాసరి వీరారెడ్డి హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే.రంజాన్, జిల్లా కార్యదర్శి ఉమా మహేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్ష,కార్యదర్శులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, శ్రీదేవి, ఐ.నాగేశ్వరరావు, మధు, బాలయ్య, మురళీ మోహన్, రమేష్ పాల్గొన్నారు.

### సోలార్‌ప్లాంట్‌కు భూ సేకరణ

బోనకల్: మండలంలోని రావినూతల సబ్‌స్టేషన్ పక్కన సర్వేనంబర్ 55లో ప్రభుత్వ భూమికి సంబంధించిన 4 ఎకరాలను సోలార్ ప్లాంట్ కోసం సమీకరించినట్లు తహసీల్దార్ పున్నం చందర్ తెలిపారు. బుధవారం ఆ భూమికి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, ఏపీఎం పద్మలత, ఆర్‌ఐ లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


పెనుబల్లి: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్


కారేపల్లి: భోజనం చేస్తున్న మండల స్పెషలాఫీసర్, ఎంపీడీఓ

పెనుబల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మండల పరిధిలోని కుప్పెనకుంట్ల బాలుర వసతి గృహాన్ని ఆమె బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం రాష్ట్ర నాయకుడు దయానంద్, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ భాగం నీరజాదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ మట్టా దేవజ్యోతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో..**

బోనకల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ పున్నం చందర్, మండల విద్యాశాఖాధికారి దామాల పుల్లయ్య పరిశీలించారు. విద్యార్థులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ లక్ష్మణ్‌నాయక్ తదితరులున్నారు.

**బాజుమల్లాయిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో..**

కారేపల్లి: మండలంలోని బాజుమల్లాయిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల స్పెషలాఫీసర్, డీసీఓ గంగాధర్, సింగరేణి ఎంపీడీఓ సురేందర్ బుధవారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కొండపల్లి అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

### రక్తదానంతో ప్రాణదానం

సత్తుపల్లి: రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ కె.రాజశేఖరగౌడ్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపో గ్యారేజీలో డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. రక్తదాతలకు అభినందనలు తెలిపారు. సాహితీ, పీ.విజయశ్రీ, కే.వెంకటేశ్వర్లు, కే.ఆకాష్, మట్టా సాత్విక్, వీబీఓ కిన్నెర ఆనంద్, సూపర్‌వైజర్లు, ఏడీసీలు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయుల రక్తదానం..**

మధిర: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం టీఎస్‌ఆర్‌టీసీ మధిర డిపోలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో మాటూరు హైస్కూల్ ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిలో ఉపాధ్యాయులు సంక్రాంతి శ్రీనివాసరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, సత్య వరప్రసాద్ ఉన్నారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల హెచ్‌ఎం శ్రీహరి, మధిర డిపో మేనేజర్ శంకర్ రావు, ఆర్టీసీ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

### గోదాదేవికి విశేష పూజలు

సత్తుపల్లిటౌన్: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని గీతాజ్ఞాన మందిరంలో గల శ్రీపార్థసారథి స్వామి ఆలయంలో బుధవారం శ్రీ గోదాదేవి అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి, అమ్మవారికి మంగళహారతులతో తిరుప్పావై ప్రవచనం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు కొత్తూరు రాజా, బాలలీలాకృష్ణ, గుడివాడ చక్రధర్, ఏపూరి పురుషోత్తం, టీ.వెంకటేశ్వరరావు, బాలాజీ, భాస్కరరావు, శ్రీను, కోటేశ్వరి, సత్యవతి, పుష్పావతి, లక్ష్మీ పాల్గొన్నారు.

### కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

మధిర: కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు తెలిపారు. దేశినేనిపాలెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త భూక్య దేశ నాయక్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా ఆయన సతీమణి నాగవేణికి పార్టీ కార్యాలయంలో పార్టీ తరపున బీమా చెక్కు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరావు, వేణు, మోహన్ రావు, పూర్ణచంద్రరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీగా గెలిపించాలి

వేంసూరు: మార్చిలో జరగబోయే వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీగా మరోసారి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి ఉపాధ్యాయులను కోరారు. బుధవారం వేంసూలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రంజాన్, జిల్లా కార్యదర్శులు నిర్మల కుమారి, మహేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, దీన్‌దయాళ్, కిషోర్, మారేశ్వరరావు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1979–81 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకొని అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం సమపంక్తి భోజనాలు చేశారు. సత్యానందం, శర్మ, సంధ్యారాణి, లక్ష్మీపతిరావు, పాపారావు, మోహన్‌రావు, సూరి బాబురెడ్డి, ప్రకాష్, బాబురావు, జగన్మోహన్‌రెడ్డి, సత్యనారయణరెడ్డి, లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, రవికుమార్, ప్రతాపరెడ్డి తదితరులున్నారు.

### టీజీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడిగా అభిరాములు


అభిరాములు

ఎర్రుపాలెం: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా స్థానిక తహసీల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కాటిబోయిన అభిరాములు ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. బుధవారం ఖమ్మంలో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా అభిరాములు, మహిళా అధ్యక్షురాలిగా ఎర్రుపాలెం డిప్యూటీ తహసీల్దార్ అరుణరెడ్డి, ఈసీ సభ్యుడిగా రామచందర్ ఎన్నికయ్యారు. వీరు ముగ్గురు స్థానిక రెవెన్యూ కార్యాలయంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా కమిటీలో ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురి సిబ్బందికి తహసీల్దార్ ఉషాశారద, స్థానిక రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

**జాతీయ గోర్ బంజారా రత్న అవార్డుకు దశరథ్‌నాయక్ ఎంపిక**

తల్లాడ: దార్మిక గురువు సన్యాసి డాక్టర్ రామ్‌రావు మహారాజ్ బంజారా నాలుగో వార్షికోత్సవం సందర్భంగా సామాజిక సేవ, సామాజిక సహకారం చేసిన విశిష్ట కృషికి గౌరవ సూచకంగా జాతీయ సన్యాసి డాక్టర్ రామారావు జాతీయ గోర్‌బంజారా రత్న అవార్డుకు తల్లాడ మండలం మల్సూర్‌తండాకు చెందిన ధర్మసోత్ దశరధ్‌నాయక్ ఎంపికయ్యాడు. ఈ నెల 11న మహారాష్ట్ర తీర్థక్షేత్రం అయిన పాద కమలంలో ఎమ్మెల్యే బాబు సింగ్ మహారాజ్ నుంచి అవార్డును అందుకోనున్నట్లు ఆయన బుధవారం ఒకప్రకటనలో తెలిపారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెనుబల్లి : ప్రజల ఆరోగ్యం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బుధవారం మండలంలోని 28 గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు, గ్రామ కూడలిలో లబ్ధిదారులను కలుసుకొని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు సోమరాజు సీతారామారావు, శ్రీనివాస రెడ్డి, కోటేశ్వరరావు, రామారావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## వితరణల వెల్లువ..

### విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కారేపల్లి: మండలంలోని పోలంపల్లి గ్రామ పంచాయతీ మోకాళ్లగుంపు ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు గ్రామ పెద్ద గుగులోత్ తేజ్యానాయక్ కుమారుడు సుభ్‌దేవ్(ఎన్‌ఆర్‌ఐ) అందించిన బ్యాగులను.. ఎంఈఓ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ప్రభుత్వం అందజేసిన యూనిఫామ్‌లను కూడా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సక్రునాయక్, హెచ్‌ఎంలు వీరూనాయక్, సుందర్, వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయుడి ఔదార్యం..**

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నెల రోజులకు అల్పాహారాన్ని పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు పద్మావతి అందించనున్నారు. ఈ సందర్భంగా టీచర్ పద్మావతిని.. ఎంఈఓ రాజేశ్వరరావు, హెచ్‌ఎం సరోజిని, ఉపాధ్యాయులు అభినందించారు.

**నిరుపేదలకు రగ్గులు పంపిణీ..**

కల్లూరు: తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకులు ఉషా దయాల్ ఆధ్వర్యంలో కల్లూరులోని కప్పల బంధం రోడ్‌లో 90మంది నిరుపేదలకు రూ.15 వేల విలువైన రగ్గులను ప్రతినిధి దయాల కిషోర్‌దత్ పంపిణీ చేసారు. నిరుపేద వితంతవులకు, వృద్ధులకు, దివ్యాంగులకు రగ్గులు అందించారు. తోపుడు బండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ముందుకు సాగుతాయని ఉషా దయాల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, జాని, చిన్నప్ప, రామ్‌లక్ష్మణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ..**

వైరారూరల్: మండలంలోని గన్నవరం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు బుధవారం విశిష్ట ఫౌండేషన్ ఆర్థిక సాయంతో కోఆర్డినేటర్, లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేందర్ రూ.30 వేలు విలువ చేసే ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. హెచ్‌ఎం, ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కేజీబీవీలో స్టడీ మెటీరియల్ పంపిణీ..**

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో టెన్త్, ఇంటర్‌మీడియట్ విద్యార్థినులకు బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఇంటర్నేషనల్ బైబిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆ సంస్థ డైరెక్టర్ టీవీ శ్యామ్‌సన్ స్టడీ మెటీరియల్, పరీక్షల ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు బాగా చదువుకుని ఉన్నతస్థానంలోకి ఎదిగేలా ఇప్పటి నుంచే కష్టపడాలని సూచనలు చేశారు. దాత వితరణను విద్యాలయం సూపరిండెంట్ సరిత, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బుచ్చియోగానందబాబు, తదితరులున్నారు.